నేడు యువ సంఘర్షణ సభ

- యూత్ డిక్లరేషన్‌పై ప్రియాంకగాంధీ ప్రకటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ తలపెట్టిన యువ సంఘర్షణ సభను సోమవారం నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న ఈ సభకు ఎఐసిసి అగ్రనేత ప్రియాంకగాంధీ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా యూత్ డిక్లరేషన్ పేరుతో నిరుద్యోగులకు భరోసా పత్రాన్ని విడుదల చేయనున్నారు. ప్రియాంక తొలిసారి రాష్ట్రానికి రానుండడంతో పార్టీ ఆ సంఘర్షణ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఆయా నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జ్‌లను నియమించి భారీ జనసమీకరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రియాంకగాంధీ తొలుత ఎల్బీనగర్ చౌరస్తాకు చేరుకుంటారు. అక్కడ తెలంగాణ అమరుడు శ్రీకాంతాచారి విగ్రహానికి నివాళులర్పిస్తారు. అక్కడి నుంచి నేరుగా సరూర్‌నగర్ స్టేడియానికి చేరుకుంటారు. అనంతరం యువ సంఘర్షణ సభలో ప్రసంగిస్తారు. వివిధ కారణాలతో మరణించిన పార్టీ కార్యకర్తలకు కాంగ్రెస్ కల్పించిన బీమా సౌకర్యాన్ని బాధితులకు అందించనున్నారు. అనంతరం నిరుద్యోగ యువతను ఉద్దేశించి ఆమె ప్రసంగించనున్నారు.

సిటీ సెంట్రల్‌లో చిన్నారికి ప్రమాదం

- తెగిన చిన్నారి వేళ్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్ నెంబర్ ఒకటిలో ఉన్న సిటీ సెంట్రల్ మాల్‌లో విషాదం చోటుచేసుకుంది. మాల్‌లోని ప్లే జోన్‌లో మూడేండ్ల చిన్నారి చేయి మిషన్‌లో పెట్టడంతో ఆమె మూడు చేతి వేళ్లు తెగిపోయాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్‌లోని ఇబ్రహీంనగర్‌కు చెందిన దంపతులు తమ ముగ్గురు పిల్లలను తీసుకుని సిటీ సెంట్రల్ మాల్‌కు వచ్చారు. పిల్లలు ప్లే జోన్‌లో ఆడుకుంటుండగా మెహ్విష్ లుబ్నా అనే మూడేళ్ల చిన్నారి ఓ యంత్రంలో చేయి పెట్టడంతో మిషన్‌లో వేళ్లు ఇరుక్కొని కుడి చేతి మూడు వేళ్లు తెగిపోయాయి. దాంతో పాపను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ బాలిక మూడు వేళ్లను వైద్యులు తొలగించినట్టు తెలిసింది. అనంతరం మాల్ నిర్వాహకులపై చిన్నారి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణం నిర్వాహకుల నిర్లక్ష్యమేనని బాలిక తండ్రి ఆరోపించాడు. సరైన సదుపాయాలు అందుబాటులో లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందన్నాడు.

బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిందే

- మేడే స్ఫూర్తితో మరిన్ని ఉద్యమాలు
- వేసుకున్న గుడిసెలకు పట్టాలివ్వాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



మేడే వారోత్సవాల ముగింపు సభలో మాట్లాడుతున్న తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ ప్రజలను మోసం చేసి గద్దెనెక్కి తినే తిండి మీద, కట్టుకునే బట్ట మీద లక్షల కోట్ల రూపాయల పన్నులు వేస్తూ మోయలేని భారాలు మోపుతున్న బిజెపి ప్రభుత్వాన్ని ఇక గద్దె దించాల్సిందేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్ కాలనీ అంగడి మైదానంలో ఆదివారం సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన మేడే వారోత్సవాల ముగింపు సభ సిపిఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు అధ్యక్షతన జరిగింది. ఇందులో తమ్మినేని వీరభద్రం పాల్గొన్నారు. ముందుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని హనుమాన్ దేవాలయం నుంచి గణేష్ చౌక్, అంబేద్కర్ సెంటర్ మీదుగా సుభాష్ కాలనీ క్రీడా మైదానంలో జరిగే బహిరంగ సభకు భారీ ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో తమ్మినేని మాట్లాడుతూ... మేడే స్ఫూర్తితో ఉద్యమాలు జరగాలని, శ్రమజీవుల రాజ్యాన్ని స్థాపించాలని అన్నారు. జిల్లా కేంద్రంలో వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని గద్దెనెక్కిందని, వాటి గురించే ఊసే లేదని విమర్శించారు. దేశం నేడు మతోన్మాద కోరల్లో చిక్కుకుందన్నారు. రాజ్యాంగ విలువలకు తూట్లు పొడిచి మనువాద రాజ్యాంగాన్ని అమలు చేస్తోందన్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవులకు వ్యతిరేకంగా సెంటిమెంట్లు రెచ్చగొట్టి ఎన్నికల్లో మరోసారి లబ్ది పొందేందుకు బిజెపి ప్రయత్నిస్తోందన్నారు. బిజెపి పాలనకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దేశంలో మోడీ, అమిత్ నేతృత్వంలో కార్పొరేట్ కంపెనీలకు లక్షలకోట్ల రూపాయలు కట్టబెడుతూ ప్రజలపై భారాలు మోపుతున్నారన్నారు. ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అమ్మేస్తున్నారని విమర్శించారు. మానవాభివృద్ధి ఆకలి సూచికలో మన దేశం 141 స్థానంలో ఉందని అన్నారు లక్షల కోట్ల నల్లధనం తీసుకొచ్చి ప్రతి కుటుంబానికి రూ.15లక్షలు ఖాతాలో వేస్తామన్న హామీ అటకెక్కిందన్నారు. దేశ వినాశనానికి పాల్పడుతున్న బిజెపిని ఓడించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ జిల్లాలో ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చి పట్టాలిచ్చి పక్కా గృహాలు నిర్మించివ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన డబుల్ బెడ్‌రూమ్ వాగ్దానాన్ని అమలు చేయాలని, ఖాళీ స్థలం ఉన్న ప్రతి పేదవాడికి ఐదు లక్షల రూపాయలు. మంజూరు చేయాలని కోరారు. అనంతరం మేడే ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన క్రీడలలో గెలుపొందిన వారికి ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు జె వెంకటేష్, శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పొలం రాజేందర్, వెలిశెట్టి రాజన్న, చెన్నూరి రమేష్, కంపేట రాజన్న, దామెర కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరామ్ పోరాట మార్గంలో ముందుకు సాగాలి

- తెలంగాణలో పాగా వేయాలి
- 'తెలంగాణ భరోసా' సభలో బిఎస్‌పి అధినేత్రి మాయావతి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాన్షీరామ్ పోరాట మార్గంలో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని బిఎస్‌పి అధినేత్రి మాయావతి అన్నారు. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో పాగా వేయాలని, తెలంగాణలో అధికారం చేజిక్కించుకోవాలని ఆమె పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన 'తెలంగాణ భరోసా సభ'కు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాయావతి మాట్లాడుతూ.. ఎస్‌టి, ఎస్‌టిల కోసం అంబేద్కర్ రిజర్వేషన్లు తెచ్చినా.. ఇంకా ఆ వర్గాల చెంతకు అభివృద్ధి చేరలేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిల కోసం మరిన్ని చట్టాలు తేవాలని న్యాయమంత్రిగా అంబేద్కర్ భావించారని, ఆయన మాటలను అప్పటి ప్రధాని నెహ్రూ లక్ష్య పెట్టలేదన్నారు. జ్యోతిబాపూలే, అంబేద్కర్, నారాయణగురు చూపిన బాటలో పయనిద్దామని పిలుపునిచ్చారు. బడుగు, బలహీన వర్గాల కోసం తన జీవితాన్ని అంకితం చేశానని మాయావతి చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి బిఎస్‌పి సంపూర్ణ మద్దతిచ్చిందనీ గుర్తు చేశారు. బిఎస్‌పి కేవలం ఎస్‌సిల కోసం కాదని, సబ్బండ వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తుందని తెలిపారు. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లో ఎస్‌సి, ఎస్‌టి, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి వారి జీవితాల్లో వెలుగులు నింపామన్నారు. తెలంగాణలో పేద దళితులకు 3 ఎకరాల భూమి పంపిణీ చేస్తామని చెప్పి సిఎం కెసిఆర్ మాట తప్పారని విమర్శించారు.

బిజెపి, బిఆర్‌ఎస్ తోడు దొంగలు: ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. బిజెపి, బిఆర్‌ఎస్ తోడు దొంగలని ఆరోపించారు. అకాల వర్షాలు కురిసి అన్నదాతలు తీవ్రంగా నష్టపోతే సిఎం ప్రగతిభవన్ దాటలేదన్నారు. బిసి, ఎస్‌టి, ఎస్‌సిలు, మైనార్టీలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. బిసి ప్రధాని అని చెప్పుకొంటున్న ప్రధాని మోదీ.. బిసిలకు ఏం చేశారని ప్రశ్నించారు. తెలంగాణలో బహుజన రాజ్యం ఏర్పడిన తర్వాత రైతు సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సరూర్‌నగర్ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి బిఎస్‌పి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఒమ్ని హాస్పిటల్ నుంచి సరూర్‌నగర్ మైదానం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

సాంకేతిక లోపంతో నిలిచిపోయిన 'కోణార్క్'

- గంటన్నర పాటు ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం జిల్లా బోనకల్ - మోటమర్రి రైల్వే స్టేషన్ల మధ్యలో గోవిందాపురం (ఎ) గ్రామ సమీపంలో ఇంజన్‌లో ఏర్పడిన సాంకేతిక లోపంతో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ గంటన్నర పాటు నిలిచిపోయింది. దాంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముంబై నుంచి భువనేశ్వర్ బయలుదేరిన కోణార్క్ ఎక్స్‌ప్రెస్ బోనకల్ రైల్వే స్టేషన్ దాటిన కొద్దిసేపటికి ఉదయం 9.20 గంటల సమీపంలో ఇంజన్‌లో సాంకేతిక లోపం ఏర్పడింది. రైల్వే డ్రైవర్లు బోనకల్, మోటమర్రి రైల్వే స్టేషన్‌లకు సమాచారం అందించారు. మోటమర్రి రైల్వేస్టేషన్‌లో ఉన్న మరో ఇంజన్‌ను తీసుకువచ్చి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు తగిలించారు. అనంతరం 10.52 రైలు కదిలింది. ఈ సమయంలో దిగువ లైన్‌పై (విజయవాడ వైపు వెళ్లే) రాకపోకలు గంటన్నరపాటు నిలిచిపోయాయి.

ఉద్యమకారులకు ప్రియాంక గాంధీ క్షమాపణలు చెప్పాలి

- మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సకాలంలో రాష్ట్రం ఇవ్వక.. నీళ్లు-నిధులు-నియామకాల నినాదంతో పోరాటం చేసిన తెలంగాణ ఉద్యమకారుల బలిదానాలకు కారణమైనందుకు కాంగ్రెస్ తరపున ప్రియాంక గాంధీ క్షమాపణ చెప్పాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కెటిఆర్ డిమాండ్ చేశారు. యువ సంఘర్షణ సభ పేరుతో సోమవారం తెలంగాణకు వస్తున్న ప్రియాంక గాంధీ పర్యటనపై ఆయన స్పందించారు.

ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో 2.2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రయివేటు రంగంలో 22 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని కెటిఆర్ తెలిపారు. బిఆర్‌ఎస్ తరహాలోనే జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బిజెపిలు పనిచేస్తే ఏ ఒక్కరూ నిరుద్యోగిలా మిగిలేవారు కాదన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఇక్కడ చేసిన నియామకాలు, కల్పించిన ఉద్యోగ ఉపాధి అవకాశాలు, యువతకు ఏం మంచి చేశారో చెబితే బాగుంటుందని ప్రియాంక గాంధీని ఉద్దేశించి ఆయన అన్నారు. దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో సంక్షోభానికి కేంద్రంగా ఉన్న తెలంగాణ, తొమ్మిదేళ్ల కెసిఆర్ పాలనలో దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా ఎదిగిందని ఆయన తెలిపారు.

కాంగ్రెస్ హయాంలో తాగునీటి కోసం కిలో మీటర్లకు కిలో మీటర్లు నడిచి గోస పడ్డ తెలంగాణ ఆడబిడ్డలు ఆ విషయాన్ని ఇంకా మరిచిపోలేదన్న సంగతిని ప్రియాంక గాంధీ గుర్తుంచుకోవాలన్నారు. 2004 కామన్ మినిమమ్ ప్రోగ్రామ్‌లో పెట్టినప్పుడే తెలంగాణ ఇచ్చి ఉంటే వందల మంది తెలంగాణ బిడ్డల బలిదానాలు జరిగేవి కాదన్న సత్యాన్ని తెలుసుకోవాలన్నారు. సోనియాగాంధీని బలిదేవత అన్న వ్యక్తికే పిసిసి చీఫ్ పదవి ఇచ్చిన కాంగ్రెస్ నాయకత్వానిది అమాయకత్వమో, ఆత్మహత్యా సదృశ్యమో తేల్చుకోవాలన్నారు. తెలంగాణ ప్రజలు తమ చిరకాల స్వప్నమైన రాష్ట్రాన్ని సాధించిన కెసిఆర్ చేతిలోనే తమ భవిష్యత్తును భద్రపరుచుకున్న సంగతిని పొలిటికల్ టూరిస్ట్ ప్రియాంక గాంధీ ఈ పర్యటనలో తెలుసుకుంటారని ఆశిస్తున్నట్లు కెటిఆర్ తెలిపారు.

ఒఆర్ఆర్ కాంట్రాక్టు పెద్ద కుంభకోణం

కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రానికి బంగారుబాతు లాంటి ఆర్థిక వనరు అయిన ఔటర్ రింగురోడ్డును ఐఆర్‌బికి 30 ఏళ్లపాటు కాంట్రాక్టు ఇవ్వడం వెనుక పెద్ద కుంభకోణం ఉందని కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చి పెట్టే ఒఆర్‌ఆర్‌ను ప్రయివేటు సంస్థలకు కాంట్రాక్టు ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ నేతలు ప్రకాశ్‌రెడ్డి, రచనారెడ్డిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలను నమ్మించి మోసం చేయడంలో కల్వకుంట్ల కుటుంబం ఆరితేరిందని విమర్శించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరిస్తున్నారని, దాన్ని వ్యతిరేకిస్తూ టెండర్లలో పాల్గొంటామని ఊదరగొట్టిన బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఒఆర్‌ఆర్‌ను ఎందుకు ప్రయివేటుపరం చేస్తోందని ప్రశ్నించారు. ఒఆర్‌ఆర్‌పై ఏటేటా ఆదాయం పెరుగుతుందని, అలాంటప్పుడు ఆదాయం తగ్గించి టెండర్ ఎలా పిలుస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేలా ఐఆర్‌బీకి టెండర్ కట్టబెట్టారని విమర్శించారు. హెచ్‌ఎండిఎ మాస్టర్ ప్లాన్‌కు 2031 వరకు మాత్రమే ఆమోదం ఉందని, అలాంటప్పుడు 30 ఏళ్లకు ఒఆర్‌ఆర్ టెండర్ ప్రక్రియ చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని చెప్పారు. క్రిసిల్ కంపెనీ ఒఆర్‌ఆర్‌పై అధ్యయనం చేసి ఒక రిపోర్టు ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ రిపోర్టును బయటపెట్టడం లేదని విమర్శించారు. మణిపూర్‌లో చెలరేగుతున్న హింసపై మంత్రి స్పందిస్తూ...అల్లర్లు, హింస ద్వారా ప్రయోజనమేమీ ఉండదనీ, చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. ఆ రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.5,500 కోట్లు ఖర్చుపెట్టిందని తెలిపారు. మణిపూర్ యువత ఆ రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కోరారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

- ఆర్థిక, వైద్యఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ పథకాలను కేంద్ర ప్రభుత్వం డిల్లీలో మెచ్చుకుంటూ, వాటిని కాపీ కొట్టి దేశవ్యాప్తంగా అమలుచేస్తున్నారని, మరోపక్క గల్లీల్లో తిడుతున్నారని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రైతుబంధు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలను కాపీ కొట్టారని అన్నారు. సిఎం కెసిఆర్ తెలంగాణలో చేపట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ సమీపంలో పివి నరసింహారావు తెలంగాణ పశువైద్య కళాశాల భవన నిర్మాణానికి పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్, మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి, సిద్దిపేట జిల్లా జెడ్‌పి చైర్ పర్సన్ రోజా రాధా కృష్ణశర్మతో కలిసి ఆదివారం మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొర్రెల పంపిణీ పథకంతో ఒకప్పుడు మాంసం దిగుమతి చేసుకున్న రాష్ట్రం నేడు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకుందన్నారు. మూడు శాతం జనాభా ఉన్న రాష్ట్రానికి 38 శాతం అవార్డులు, దక్షిణ భారతదేశంలోనే అత్యధిక కేంద్ర ప్రభుత్వ అవార్డులు అందుకున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని తెలిపారు. మాజీ ప్రధాని పివి నరసింహారావు ఘాట్ నిర్మాణానికి నాటి కాంగ్రెస్ పెద్దలు ఢిల్లీలో అనుమతి ఇవ్వలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాదులో పివి ఘాట్ నిర్మించడంతో పాటు వెటర్నరీ విశ్వవిద్యాలయానికి పివి నరసింహారావు పేరు పెట్టి గౌరవించుకున్నామన్నారు. కాళోజీ పేరిట హెల్త్ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ బాపూజీ పేరిట హార్టికల్చర్ యూనివర్సిటీలను ఏర్పాటు చేసుకున్నట్టు గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో చెరువులు, రిజర్వాయర్లు జలకళను సంతరించుకున్నాయన్నారు. విద్యకు తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అనంతరం మంత్రి తలసాని మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమైందన్నారు. 2014తో పోలిస్తే నేడు తెలంగాణ పల్లెల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో బీజేపీ నేతలు అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణలో మాదిరిగా రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ప్రధాని మోడీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో లేదన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో 3,72,000 మంది మత్స్యకారులకు సభ్యత్వం అందించామని, మరో లక్ష మందికి అందించనున్నట్టు వెల్లడించారు. 18 ఏండ్లు నిండిన మత్స్యకారులకు మెంబర్ షిప్, 18 ఏండ్లు నిండిన గొల్ల కురుమలకు గొర్రెల పంపిణీ చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. మంత్రి హరీశ్‌రావు లాంటి నాయకుడు సిద్దిపేటకు దొరకడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమన్నారు.

గురుకుల ప్రిన్సిపల్స్ సంఘం ఆవిర్భావం

- గౌరవ సలహాదారుగా బోయినపల్లి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర గురుకులాల ప్రిన్సిపల్స్ సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారుడిగా ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్రంలో ఉన్న 1,062 ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, జనరల్ గురుకుల పాఠశాలలకు చెందిన ప్రిన్సిపళ్లు ఆదివారం హైదరాబాద్‌లో నూతన సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. నూతన రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా డాక్టర్ ఆర్ అజయ్‌కుమార్, రాంబాబు ఎన్నికయారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని విద్యార్థులకు బంగారు భవిష్యత్తును కల్పించడమే ఏకైక లక్ష్యంగా తమ సంఘం పని చేస్తోందని తెలిపారు. సిఎం కెసిఆర్ ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు అంకిత భావంతో కృషి చేయాలని బోయినపల్లి తమరికి ఈ సందర్భంగా సూచించారు. నూతన కార్యవర్గ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోరండ్ల చంద్ర మోహన్, కోశాధికారి జక్కని రాజేశం, ఉపాధ్యక్షులుగా బి రాజేష్, ఎం నీరజ, స్వాతి, ఉన్నారు.

పరిశోధన విద్యార్థులపై ఫీజుల మోత

- రీసెర్చ్ సెంటర్స్ కేటాయింపుపై తీవ్ర వ్యతిరేకత
- కష్టపడి తెచ్చుకున్న పెలోషిప్స్ ఫీజులుగా
- ఎందుకు చెల్లించాలంటున్న విద్యార్థులు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియా యూనివర్సిటీలో భారీగా పెంచిన ఫీజులపై పిహెచ్‌డి విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఫీజులకు వ్యతిరేకంగా వరుసగా ఆందోళనలు చేస్తున్నారు. తమకు న్యాయం జరిగేదాకా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నాలుగు సంవత్సరాల నిరీక్షణ తరువాత ఉస్మానియా విశ్వవిద్యాలయం పిహెచ్‌డి నోటిఫికేషన్ జారీ చేసింది. ఫలితాలు విడుదలై, జాయిన్ అయిన తరువాత విద్యార్థుల ఆశలపై ఓయూ అధికారులు నీళ్లు చల్లారు. గతంలో కేవలం రూ.6,250 మాత్రమే ఉన్న పిహెచ్‌డి ఫీజు (ట్యూషన్ ఫీజు)ను 5 సంవత్సరాలకు కలిపి లక్ష రూపాయలకు, మరికొన్ని కోర్సులకు లక్షా ఇరవై ఐదువేల రూపాయలకు పెంచారు. దాంతో పిహెచ్‌డి అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ఫీజుల పెంపును ఉపసంహరించుకోవాలని ఉద్యమిస్తున్నారు. వారికి విద్యార్థి సంఘాలు మద్దతిచ్చారు. కొన్ని విభాగాల్లో పిహెచ్‌డి అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు హాస్టల్, మెస్ సౌకర్యాలు కూడా ఇప్పటి వరకు యూనివర్సిటీ కల్పించలేదు. గతంలో అన్ని విభాగాల విద్యార్థులకు అడ్మిషన్, సూపర్ వైజర్ అలాట్మెంట్ ఓయూలోనే జరిగేది. నేడు దానికి భిన్నంగా ప్రయివేట్ రీసెర్చ్ సెంటర్స్‌కు అలాట్ చేశారు. ఆ సెంటర్స్‌లో అడ్మిషన్స్ పొందిన విద్యార్థులకు హాస్టల్, మెస్ సౌకర్యాలు కల్పించలేదు. గ్రామీణ ప్రాంతాల్లో నుంచి వచ్చిన తమకు పరిశోధన విద్యను ఎలా పూర్తి చేయగలమని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు.

ఫీజుల పెంపు దారుణం
సత్య నెల్లి, పొలిటికల్ సైన్స్ రీసెర్చ్ స్కాలర్

దేశంలోని ఏ ప్రభుత్వ యూనివర్సిటీలో లేని విధంగా ప్రయివేటు విద్యా సంస్థలాగా ఓయూలో ఐదేళ్లకు మొత్తంగా రూ.లక్ష వరకు ఫీజును పెంచడం దారుణం. ముందు రీయింబర్స్ అవుతుంది.. విద్యార్థులకే అవగాహన లేదని అధికారులు అన్నారు. ఇప్పుడు అడిగితే రీయింబర్స్‌మెంట్ తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నామంటున్నారు. ప్రయత్నాల దశలో ఉన్నప్పుడు విద్యార్థుల నుంచి డబ్బులు ఎలా వసూల్ చేస్తారు? ఫీజులు పెంచడం వల్ల కొంత మంది విద్యార్థులు అడ్మిషన్లు క్యాన్సల్ చేసుకున్నారు. దీని గురించి వివరణ కోరితే '80 శాతం విద్యార్థులు ఫీజు చెల్లించారు. మిగతా 20 శాతం గురించి ఆలోచించాల్సిన అవసరం ఏముంది.? వాళ్ళు ఫీజు చెల్లించగలిగితే జాయిన్ అవుతారు లేకపోతే కారు' అని అధికారులు సమాధానం ఇస్తున్నారు. ఇది పేద వర్గాలకు దళిత వర్గాలకు ఉన్నత విద్యను దూరం చేసే కుట్ర కాదా? నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు ప్రజాస్వామ్య బద్దంగా మా నిరసనను తెలియచేస్తూనే ఉంటాం.

ప్రొఫెసర్ల కొరత తీవ్రంగా ఉంది
ఆజాద్, ఫిలాసఫీ రీసెర్చ్ స్కాలర్

ఓయూలో ఒక్కో ప్రొఫెసర్‌కు ఎనిమిది మంది, అసోసియేట్ ప్రొఫెసర్‌కు ఆరుగురు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు నలుగురు విద్యార్థులను పరిశోధనకు కేటాయిస్తారు. ప్రొఫెసర్‌ల కొరత తీవ్రంగా ఉంది. రిక్రూట్‌మెంట్ జరగక విద్యార్థుల పరిస్థితి గందరగోళంగా మారింది. దిక్కుతోచని స్థితిలో ప్రయివేటు రీసెర్చ్ సెంటర్‌లకు విద్యార్థులను విసి పంపిస్తున్నారు. అక్కడ రెక్టిఫైడ్ కానీ టీచర్ల వద్ద ఎలా పరిశోధనకు అనుమతిస్తారు. పిహెచ్‌డి చదివే మా సెమినార్‌లను, సిహెచ్‌డి విద్యార్హత లేని కొన్ని కళాశాలల ప్రిన్సిపాల్‌లు ఎలా పర్యవేక్షిస్తారు. తార డిగ్రీ కళాశాల సంగారెడ్డికి తెలుగు, బేగంపేట్ గౌట్ కళాశాలకు ఎకనామిక్స్, అరోరా డిగ్రీ కళాశాలకు కెమిస్ట్రీ కేటాయించారు. అక్కడ ఫీజులు మళ్ళీ కట్టాలని విద్యార్థులపై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది.

ఫీజుల గురించి ముందే చెప్పాల్సింది
అఖిల్ బొద్దుపల్లి, తెలుగు పరిశోధక విద్యార్థి

మేము సెప్టెంబర్ 2022న ఓయూలో పరిశోధక విద్యార్థులుగా చేరాము. మాకు ఇచ్చిన జాయినింగ్ ఆర్డర్‌లో 4 ఏండ్లకు రూ.4000 ఫీజుగా చూపించారు. మేము రూ.వెయ్యి చెల్లించి అడ్మిట్ అయ్యాము. తొమ్మిది నెలల తర్వాత యూనివర్సిటీ నిర్ణయంగా లక్ష రూపాయలు చెల్లించాలంటున్నారు. జాయినింగ్ ఆర్డర్‌ను కూడా వాళ్ళు గౌరవించరా. ఒకవేళ ముందే ఇంత ఫీజు అని చెప్పి ఉంటే మా నిర్ణయం వేరే విధంగా ఉండేదేమో.

సౌకర్యాలను కల్పించాలి
చేవెళ్ల యాదగిరి, పరిశోధక విద్యార్థి

పిహెచ్‌డి విద్యార్థులకు మంచి సౌకర్యాలను అందించవలసిన బాధ్యత ఓయూపై ఉంది. పరిశోధన చేసే విద్యార్థికి హాస్టల్ వసతి లేదు. అడ్మిషన్ ఫీజు కట్టడానికి మూడు రోజుల వ్యవధి ఇచ్చారు. ఓయూలో జాయిన్ అయి 50 రోజులు అవుతున్నా తినడానికి తిండి లేక, పడుకోవడానికి చోటు లేక విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే ఓయూలో పరిశోధక విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలి.

సమిష్టి నిర్ణయం
ఓయురిజిస్ట్రార్, ప్రొ.లక్ష్మీ నారాయణ

పిహెచ్‌డి ఫీజులు డీన్స్, స్టాండింగ్ కమిటీ నిర్ణయం మేరకు పెంచాము. ఇది సమిష్టి నిర్ణయం. సైన్స్, ఇంజినీరింగ్ విద్యార్థులకు సంవత్సరానికి రూ.25,000, ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్స్ విద్యార్థులకు సంవత్సరానికి రూ.20 వేలు. ఆదాయం తక్కువ ఉన్న విద్యార్థులకు స్కాలర్‌షిప్ దరఖాస్తు చేసుకోవాలి..

ప్రశాంతంగా ముగిసిన నీట్

- రాష్ట్రం నుంచి 65 వేల మంది హాజరు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎంబిబిఎస్, బిడిఎస్ తదితర మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) ప్రశాంతంగా ముగిసింది. దేశవ్యాప్తంగా సుమారు 20.5 లక్షల మంది హాజరుకాగా.. మన రాష్ట్రం నుంచి 65 వేల మంది పరీక్ష రాశారు. అల్లర్లు జరుగుతున్న నేపథ్యంలో మణిపూర్‌లో ఈ పరీక్షను వాయిదా వేశారు. మన రాష్ట్రంలో గ్రేటర్ హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, రంగారెడ్డి, వరంగల్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, జయశంకర్ భూపాలపల్లి, గద్వాల, జగిత్యాల, జనగాం, కొత్తగూడెం, మహబూబాబాద్, మంచిర్యాల, మేడ్చల్, నల్లగొండ, నిజామాబాద్, సిద్దిపేట, సూర్యాపేట్ ప్రాంతాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అరగంట ముందు వరకూ విద్యార్థులను హాల్‌లోపలికి అనుమతించారు. ఒకటిన్నర తర్వాత వచ్చిన విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించలేదు. పరీక్ష రాసిన విద్యార్థులు ఈసారి ప్రశ్నాపత్రం మధ్యస్తంగా వచ్చిందనీ, ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాల నుంచే ఎక్కువ ప్రశ్నలు వచ్చాయని తెలిపారు. బయాలజీ ప్రశ్నలు సులభంగా ఉన్నాయని, కెమిస్ట్రీ ప్రశ్నలు చాలా కష్టతరంగా వచ్చాయని అభిప్రాయపడ్డారు. ఫిజిక్స్ క్వశ్చన్స్ మిక్స్‌డ్‌గా ఉన్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో గతేడాది కంటే ఈసారి కట్ ఆఫ్ స్కోర్ పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రం నుంచి 40 నుంచి 45 వేల మంది అర్హత సాధించే అవకాశం ఉండగా.. 8 వేలకుపైగా ఎంబిబిఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి.

కల్తీ అల్లం పేస్ట్ తయారు చేస్తున్న.. ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో



కల్తీ అల్లం పేస్ట్ తయారు చేస్తున్న పరిశ్రమపై ఎస్ఒటీ పోలీసులు దాడులు చేసి ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటేదాన్‌లోని శాంతినగర్‌లో ఫిరోజ్, హాజిల్ అనే ఇద్దరు వ్యక్తులు కొన్నేండ్ల నుంచి గుట్టు చప్పుడు కాకుండా కల్తీ ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారు. కల్తీ అల్లం పేస్ట్, మాంగో డ్రింక్ తయారు చేస్తున్నారు. ఈ కల్తీ అల్లం పేస్ట్‌లో ప్రమాదకర ఎసిటిక్ యాసిడ్‌ను ఉపయోగిస్తున్నారు. అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం ఆ పరిశ్రమలపై ఎస్ఒటి దాడులు నిర్వహించగా పెద్ద ఎత్తున కల్తీ అల్లం పేస్ట్ లభ్యమైంది. ఫిరోజ్, హాజిల్ అదుపులోకి తీసుకొని విచారించగా కల్తీ వ్యాపారం చేస్తున్నట్టు ఒప్పుకున్నారు. వీరిద్దరిని అరెస్టు చేసి మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరో మూడురోజులు వర్షాలు

- వాతావరణ కేంద్రం వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో రాగల మూడురోజులు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలో అక్కడకక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. దిగువ స్థాయిలోని గాలులు దక్షిణ దిశ నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి వీస్తున్నాయని పేర్కొంది. శనివారం ఆగ్నేయ బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో ఉన్న ఉపరితల ఆవర్తనం ఆదివారం ఆగ్నేయ బంగాళాఖాతం పరిసరాల్లోని అండమాన్ సముద్రంలో కొనసాగుతూ, సగటు సముద్ర మట్టం నుంచి మధ్య ట్రోపోస్పిరిక్ స్థాయి వరకు ఉందని వివరించింది. దీని ప్రభావంతో అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించింది. ఇది ఆగ్నేయ బంగాళాఖాతం పరిసరాల్లోని అండమాన్ సముద్రంలో తొమిదవ తేదీన వాయుగుండంగా కేంద్రీకృతమయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఆ తర్వాత దాదాపు ఉత్తరం దిశగా పయనిస్తూ మధ్య బంగాళాఖాతం పరిసరాల్లోని అండమాన్ సముద్రం వైపునకు కదులుతూ తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉందని వెల్లడించింది. అల్పపీడనంగా మారిన తర్వాత ఈ తుపాను దిశ, వేగం, తీవ్రత, ప్రయాణించే మార్గం తెలుస్తాయని పేర్కొంది. దీని ప్రభావం వల్ల తెలంగాణ రాష్ట్రంలో 9వ తేదీ నుంచి గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయని వెల్లడించింది. కొన్ని చోట్ల ఉష్ణోగ్రతలు దాదాపుగా 40 నుంచి 43 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపింది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో సుమారుగా 40 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ పేర్కొంది.

మణిపూర్ నుంచి తెలంగాణ విద్యార్థుల తరలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మణిపూర్‌లో చదువుకుంటున్న తెలంగాణ విద్యార్థులను సురక్షితంగా హైదరాబాద్‌కు తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆదివారం రాత్రిగానీ, సోమవారం ఉదయంగానీ ఇంఫాల్ నుంచి ప్రత్యేక విమానంలో వారు బయలుదేరనున్నారు. కలకత్తా మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోనున్నారు. ఇప్పటికే ఢిల్లీకి హర్షవర్ధన్ అనే విద్యార్థి చేరుకున్నారు. అతడు బస చేసేందుకు తెలంగాణ భవన్‌తో పాటు హైదరాబాద్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. విద్యార్థుల తరలింపుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మణిపూర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. మరో వైపు విద్యార్థుల భద్రతపై మణిపూర్ రాష్ట్ర పోలీసులతో డిజిపి అంజనీకుమార్ ఎప్పటికప్పుడు సంప్రదిస్తున్నారు.

సామాజిక స్పృహ అంశంతో పర్యావరణ పరిరక్షణ నృత్య రూపకం

ప్రజాశక్తి కల్చరల్

నేడు ప్రపంచమంతా వాతావరణ కలుష్య మయమై పలు సమస్యలకు కారణం అవుతోంది. ఈ సమస్యలను అధిగమించేందుకు వృక్ష పరిరక్షణ, భూగర్భ జలాలు కాపాడటం అడవులు యధా స్థితికి సాగించటం వంటి అంశాలతో పర్యావరణ పరిరక్షణ నృత్య రూపకం సంప్రదాయ కూచిపూడి నాట్య శైలిలో కళాకారులు నర్తించి జాగృతం చేశారు. రవీంద్రభారతి ప్రధాన వేదికపై కురుగంటి కళాక్షేత్ర 26వ వార్షికోత్సవం జరిగింది. నృత్య గురువు రాధిక శిష్య బృందం కుండానిక, శ్రీయ, చిన్మయి, శుచిత్ర, సాహితి, శ్వేత తదితరులు 30 మంది కళాకారిణులు నృత్య రూపకాన్ని రక్తి కట్టించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలోముఖ్య అతిథిగా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ పాల్గోని మాట్లాడుతూ సంప్రదయ నాట్య శైలిలో ఆధునిక పరిస్థితులకు అణుగుణంగా సందేశాత్మక నృత్య రూపకాల అవసరం వుందని గురువు రాధికను అభినందించారు. గురువు రాధిక మాట్లాడుతూ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం అందించారని తెలిపారు నాట్య గురువు డాక్టర్ సుధాకర్, టి నరేష్ తదితరులు పాల్గొన్నారు. వివిధ రంగ ప్రముఖులను సత్కరించారు

మేం అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాల భర్తీ

- యుపిఎస్‌సి తరహాలో ఏటా జాబ్ కెలెండర్ విడుదల చేస్తాం : బండి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని, యుపిఎస్‌సి తరహాలో ఏటా జాబ్ కెలెండర్ విడుదల చేస్తామని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, ఎంపి బండి సంజయ్‌కుమార్ ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. లీకేజీకి ఆస్కారం లేకుండా పరీక్షలు నిర్వహిస్తామని హామీనిచ్చారు. వేలాది మందితో ఈ నెల 11న సంగారెడ్డిలో నిర్వహించే నిరుద్యోగ మార్చ్‌ను జయప్రదం చేయాలని కోరారు. టిఎస్‌పిఎస్‌సి ప్రశ్నాపత్రాల లీకేజీపై హైకోర్టు సిట్టింగ్ జడ్జీతో న్యాయ విచారణ జరిపించాలని, బాధ్యుడైన ఐటీ శాఖ మంత్రిని క్యాబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. టిఎస్‌పిఎస్‌సి పరీక్షల రద్దుతో నష్టపోయిన ప్రతీ నిరుద్యోగికి లక్ష రూపాయల పరిహారం ఇవ్వాలని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరారు. అన్ని జిల్లా కేంద్రాల్లో నిరుద్యోగుల మార్చ్‌లు అయిపోగానే వచ్చే నెలలో హైదరాబాద్ లో "మిలియన్ మార్చ్" నిర్వహిస్తామని తెలిపారు.

కౌలుకేదీ పరిహారం

పెరుగుతున్న కౌలు విస్తీర్ణం..

- పంట నష్టం కౌలుదారుడికి.. పరిహారం భూ యజమానికి..
- డిక్లరేషన్ ఇవ్వడానికి సిద్ధపడని పట్టాదారులు
- రైతు బంధు, రుణమాఫీ, పంట నష్టం అన్నీ వాళ్లకే..
- అమలు కాని భూ ఆధీకృత సాగుదారుల చట్టం



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'నాలుగు ఎకరాల్ని కౌలుకు తీసుకున్న. ఎకరాకు రూ.15 వేల కౌలు. మూడేళ్లకు రూ.1.80లక్షలు.. పంటల సాగు కోసం పెట్టుబడులు పెట్టాం. అల్లం సాగు లాభసాటిగా ఉందని కెసిఆర్ చెప్పిన మాట నమ్మి ఎకరంలో అల్లం సాగు చేసిన. ఎకరం బొప్పాయి, రెండెకాల్లో మొక్కజొన్న సాగు చేసినం. పంట చేతికొచ్చే దశలో వడగండ్ల వానలొచ్చి పంటంతా పాడై.. పెట్టుబడి అప్పు మిగిలింది. కౌలు పైసలు సగం ముందే కట్టినం. పంట పాడైంది. ఆదుకునే వారేరి. సర్కారిస్తమంటున్న నష్టపరిహారం మాకివ్వరంట. సాయమంటే వ్యవసాయానికి కానీ..! భూ యజమానికి కదుకదయ్యా..!! ఇదీ.. కోహీర్ మండలంలోని బిలాల్పూర్‌కు చెందిన కౌలు రైతు విట్టల్ కన్నీటి రోధన.

నాలుగు ఎకరాల మామిడి తోటను కౌలుకు తీసుకున్నం. ఏడాది పాటు తోట సంరక్షణ, పూత, కాత నిలిచేందుకు, సస్యరక్షణ కోసం లక్షలు పోసి మందులు పిచికారి చేసినం. ఎరువులు, నీరు, పోషణకు పెట్టుబడులు పెట్టినం. యజమానికి సగం కౌలు డబ్బులు ముందే కట్టినం. వడగండ్లు, ఈదురు గాలుల వర్షాలతో చెట్ల కాయలన్నీ నేలపాలయ్యాయి. తోటలో చెట్లకు కాయ మిగల్లే. మొక్కజొన్న పొట్టుపొట్టయింది. కౌలు రైతుకు పెట్టుబడి సాయమిస్తలేరు. బ్యాంకులోళ్లు రుణమియ్యరు. పంట పాడైతే పైసలియ్యకపోతే ఎట్ల..? వ్యవసాయం చేయడమే మేం చేసిన నేరమా..? అంటూ మనియార్‌కు చెందిన మహామ్మద్ అలీ అనే కౌలు రైతు తన గోషను వ్యక్తం చేశారు.

6502 ఎకరాల్లో పంట నష్టం

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల వడగళ్ల వానల వల్ల వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. వ్యవసాయ అధికారులు ఇప్పటికే పంట నష్టాన్ని అంచనా వేశారు. సంగారెడ్డి జిల్లాలో 5682 ఎకరాల్లో, వరి, మొక్కజొన్న, జొన్న, టమాటా, ఉల్లి, మామిడి పంటలు 33 శాతానికిపైగా దెబ్బతిన్నట్టు గుర్తించారు. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ మండలంలో అత్యధికంగా 1794.16 ఎకరాల్లో వరి, మామిడి, ఉల్లి, మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని గుర్తించారు. జహీరాబాద్ మండలంలో 374.46 ఎకరాల్లో, కంగ్టి మండలంలో 341.18 ఎకరాల్లో, ఘరాసంఘం మండలంలో 451.11 ఎకరాల్లో, న్యాల్‌కల్ మండలంలో 206.06 ఎకరాల్లో, సదాశివపేట మండలంలో 183.01 ఎకరాల్లో, ఇలా మరో 10 మండలాల్లో 33 శాతానికిపైగా నష్టపోయినట్టు పంటలను గుర్తించి ఎకరాలకు రూ.10 వేల నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. సిద్దిపేట, మెదక్ జిల్లాల్లోనూ ఏప్రిల్ చివర్లో కురిసిన వానలకు ఏర్పడిన నష్టాన్ని అంచనా వేస్తున్నారు.

కౌలు రైతుకందని సాయం

కోహీర్ మండలంలోని మనియార్ గ్రామంలో మహముద్ అలీ అనే కౌలు రైతు గ్రామంలో మామిడి తోటను కౌలుకు తీసుకున్నారు. రూ. ఎనిమిది లక్షలు ఖర్చు చేశారు. కాయ చేతికొచ్చే సమయంలో వానలొచ్చి పూర్తిగా కాయరాలిపోయింది. పైసా ఆదాయం వచ్చే పరిస్థితిలేదు. రాలిన కాయల్ని చూసి ఆ రైతు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు. అదే విధంగా ఉల్లి, వరి, మొక్కజొన్న, జొన్న పంటలకూ తీవ్రంగా నష్టం వాటిల్లింది. మండలంలో 200 ఎకరాల వరకు మామిడి తోటల్లో కాయరాలిపోయి కౌలు రైతులకు నష్టమేర్పడింది. ఎకరాకు లక్ష రూపాయల కౌలు డబ్బులు చెల్లించి ఏడాది పాటు తోటల్ని సాగు చేసిన రైతుకు పైసా ఆదాయం వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మామిడి తోటల్ని కౌలుదారులే సాగు చేస్తున్నారు. వీరంతా నష్టపోయారు. సంగారెడ్డి జిల్లాలో యాసంగి సీజన్‌లో 3.32 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 3.75 లక్షల మంది రైతులుండగా అందులో 1.50 లక్షల మంది కౌలు రైతులున్నట్టు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాల వల్ల జిల్లాలోని 15 మండలాల్లోని 258 గ్రామాల్లో 33 శాతం పంట నష్టం వాటిల్లినట్టు అధికారులు గుర్తించారు. 3093 మంది రైతులకు చెందిన పంటలు దెబ్బతినగా అందులో 2200 ఎకరాల వరకు కౌలు రైతులకు చెందిన పొలాలున్నాయి. జిల్లాలో కురిసిన అకాల వడగళ్ల వానల వల్ల 5682 ఎకరాల్లో వివిద పంటలు దెబ్బతిన్నందున ప్రభుత్వం రూ.56.82 కోట్ల పరిహారం ప్రకటించింది. పంటలు సాగు చేసి నష్టపోయిన కౌలు రైతులకు మాత్రం పైసా సాయమందదు.

అమలుకు నోచని భూ ఆధీకృత సాగుదారుల చట్టం

తెలంగాణ వ్యాప్తంగా 61 లక్షల మంది భూ యజమానులున్నారు. భూమిలేని కౌలుదారులు 21.71 లక్షల మంది ఉన్నట్టు రైతు స్వరాజ్య వేదిక తన సర్వేలో గుర్తించింది. వ్యవసాయం చేసే వారిలో పట్టాదారులతో పాటు కౌలుదారులూ సగం మంది వరకు ఉంటున్నారు. భూమికి కౌలు చెల్లించి పంటలు సాగు చేసి నిలదొక్కుకోవడం కౌలుదారులకు కష్టంగా మారింది. ఉమ్మడి రాష్ట్రంలో 2011లో భూ ఆధీకృత సాగుదారుల చట్టం తెచ్చారు. ఈ చట్టం ద్వారా కౌలు రైతులు రుణ అర్హత కార్డులు పొంది బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్నారు. తెలంగాణ వచ్చాక కౌలు రైతుల్ని గుర్తించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిరాకరిస్తుంది. వ్యవసాయం తప్ప మరో ఆధారంలేని చిన్న, సన్నకారు రైతులతో పాటు అస్సలు భూమిలేని వాళ్లు కౌలు పద్ధతిలో వ్యవసాయం చేస్తున్నారు. ఎకరాలకు రూ.పది నుంచి రూ.30 వేల వరకు కౌలు చెల్లిస్తూ కాగితాల ద్వారా కాకుండా నోటి మాట ద్వారానే ఒప్పందం చేసుకుంటున్నారు. సాగు వ్యయం పెరిగిపోవడం, దిగుబడులకు గిట్టుబాటు ధర రాకపోవడంతో కౌలుదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల దిగుబడులు రాకపోయే సరికి సాగు కోసం చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. జాతీయ నేర గణాంక సంస్థ 2021 లెక్కల ప్రకారం.. తెలంగాణలో 2018లో 900 మంది, 2019లో 491 మంది, 2020లో 466 మంది, 2021లో 352 మంది వ్యవసాయం భారంగా మారి రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇందులో అధిక మంది కౌలుదారులే ఉన్నారు. 2018 నుంచి రైతు బంధు పథకం అమలవుతోంది. ఆ సాయం కౌలుదారుడికి ఇవ్వాలని కోరుతున్నారు.

డిక్లరేషన్ ఉంటే పరిహారం:
జి నర్సింహారావు, జిల్లా వ్యవసాయ అధికారి

కౌలు రైతులు భూ యజమాని నుంచి సాగుకు డిక్లరేషన్ రాయించుకోవాలి. పలానా సర్వే నెంబర్‌లో పలాన పంట వేశారు. అట్టి పంట వర్షాలకు దెబ్బతిన్నందున నష్టపరిహారం ఇవ్వాలి. కౌలు రైతుకు పరిహారం ఇవ్వడం పట్ల తమకు ఎలాంటి అభ్యంతరం లేదని డిక్లరేషన్‌లో ఉండాలి. అట్టి ప్రతిని వ్యవసాయ శాఖకు అందజేయాలి.

చెట్టుకు కట్టేసి నరకయాతన

- తోట యాజమానిపై కేసు నమోదు చేయాలన్న బాలిక తల్లిదండ్రులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బత్తాయి తోటలో పండ్లకోసమని వెళ్లిన బాలిక ప్రవళికపై తోట యజమాని దొంగతనం మోపి మండుటెండలో గొలుసులతో కట్టి నరకయాతన పెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గద్వాల జిల్లా మల్దకల్ మండలం విఠలాపురం గ్రామంలో శనివారం జరిగిన ఈ ఘటన సోషల్ వీడియాలో హల్‌చల్ చేస్తోంది. కాగా, తోట యాజమాని శ్రీలతపై కేసునమోదు చేయాలని ప్రవళిక తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాలిక ప్రవళిక బత్తాయి తోటలోకి వెళ్లగా.. ఆమెను చూసిన తోట యజమాని భార్య శ్రీలత.. ఆమెపై దొంగతనం మోపి గొలుసులతో చెట్టుకు కట్టేసింది. దాహంతో మంచినీళ్లు అడిగినా.. కనికరించకుండా గంటల తరబడి మండుటెండలో నరకయాతన పెట్టింది. విషయం తెలుసుకున్న ప్రవళిక తల్లిదండ్రులు తోటకు వెళ్లి యజమాని కళ్లావేళ్ల పడ్డా విడిచిపెట్టలేదు. పైగా ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండంటూ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. అంతేకాదు, ఏ పోలీస్‌స్టేషన్‌లో అయినా కేసు పెట్టుకోండి.. మమ్మల్ని ఎవ్వరూ ఏమీచేయలేరంటూ బాలిక తల్లిదండ్రులపై విరుచుపడ్డారు. మీ గొర్రెలు ఈ ఊర్లో ఎలా మేపుకుంటారో చూస్తామని, మీ అంతుచూస్తామంటూ బెదిరించారు. ఈ సంఘటన సోషల్ మీడియాలో హల్‌చల్ కావడంతో తోట యాజమాని బాలిక తల్లిదండ్రులతో బేరసారాలకు ప్రయత్నాలు చేసినట్టు సమాచారం. తోట యజమాని మహేందర్ రెడ్డి భార్యపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాలిక తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు



ఓటమి భయంతో బిజెపి నాయకుల బెదిరింపులు

- టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి
- కర్ణాటక బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థిపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కర్ణాటకలో ఓటమి భయంతో కాంగ్రెస్ నాయకులను చంపుతామని బెదిరిస్తున్న బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి మణికంఠపై కఠిన చర్యలు తీసుకోవాలని టిపిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి కోరారు. ఆదివారం కాంగ్రెస్ నాయకులు సంపత్ కుమార్, అంజన్ కుమార్ యాదవ్ ఇతర నాయకులతో కలిసి ఆయన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి మణికంఠపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అందుకు సంబంధించిన ఆడియో టేప్‌ను ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డికి అందజేశారు. అనంతరం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కర్ణాటకలో ఓటమి భయంతో చిత్తాపూర్ నియోజకవర్గ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి మణికంఠ బహిరంగంగా చిత్తాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంక ఖర్గేను, వారి తండ్రి మల్లికార్జున ఖర్గేను, వారి కుటుంబ సభ్యులను చంపుతానని బెదిరించారని తెలిపారు. దాంతో అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ గెలుస్తోందని, అందుకు ఉదాహరణ ఇటీవల హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ విజయం అన్నారు. ఇప్పుడు కర్ణాటకలోనూ కాంగ్రెస్ గెలుస్తుందని, అలాగే తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

నిరుద్యోగులకు భరోసా కోసమే సభ

- పేదల భూములన్నీ బిఆర్ఎస్ గుంజుకుంది
- మాణిక్ రావు ఠాక్రే, మల్లు భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో పాటు పేదల భూములు బిఆర్ఎస్ ప్రభుత్వం లాక్కుందని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎవరి భూములు వారికి తిరిగి ఇస్తామని తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి మాణిక్ రావు ఠాక్రే, సిఎల్‌పి నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా ఆదివారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్ పూర్, గుంతపల్లి లస్కర్‌గూడ, అబ్దుల్లాపూర్ గ్రామాల్లో పాదయాత్ర చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను కాంగ్రెస్ పార్టీ తీర్చిందన్నారు. తెలంగాణ వస్తే చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయని, నిరుద్యోగ సమస్య పోతుందని అనుకున్నా నేటికి నిరుద్యోగ సమస్య పెచ్చుమీరిందన్నారు. ఒక్కగానొక్క నోటిఫికేషన్ వేసి, దాన్ని మళ్లీ లీకులు చేసి నిరుద్యోగులను మోసం చేశారని ఆరోపించారు. ఇలాంటి మోసాలను యువత పసిగట్టాలన్నారు. మేధావులు, విద్యార్థులు, నిరుద్యోగులు ఆవేశానికి, ఆక్రోశానికి గురైతే విస్ఫోటనం కంటే పెద్ద ప్రమాదమని, నిరుద్యోగ సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు భరోసా కల్పించడం కోసమే సోమవారం బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సభలో ప్రియాంక గాంధీ యూత్ డిక్లరేషన్ ప్రకటిస్తారన్నారు. నూటికి నూరు శాతం ఇచ్చిన హామీలు అమలు చేస్తామన్నారు. సభకు నిరుద్యోగ యువత అత్యధికంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఐసిసి కార్యదర్శి రోహిత్ చౌదరి, మాజీ పిసిసి అధ్యక్షులు హనుమంతరావు, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, డిసిసి అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, మాజీ శాసనసభలు రంగారెడ్డి, పిసిసి వైస్ ప్రెసిడెంట్ చామల కిరణ్ కుమార్ రెడ్డి, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి, యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్తి పంచివ్వలేదని..

- తల్లి మృతదేహాన్ని తీసుకెళ్లని కూతుర్లు
- కామారెడ్డిలో అమానవీయ ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రస్తుతం సమాజంలో రోజురోజుకూ డబ్బుపై పెరుగుతున్న వ్యామోహం.. కుటుంబ బాంధవ్యాలను చిన్నాభిన్నం చేస్తోంది. ఇన్ని రోజులు తల్లిదండ్రుల బాగోగులు చూడని కొడుకులను చూశాం. తాజాగా ఓ ఇద్దరు కూతుళ్లు తమకు ఆస్తి పంచివ్వలేదని తల్లి మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు నిరాకరించిన అమానవీయ ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..

కామారెడ్డి పట్టణంలోని ఆర్‌బినగర్‌కు చెందిన కిష్టవ్వ (70)కు ముగ్గురు కుమార్తెలు. ఇటీవల ఒక కూతురు మృతిచెందగా.. ఇద్దరు కూతుళ్లు పట్టణంలోనే నివసిస్తున్నారు. కిష్టవ్వ పేరు మీద ఇల్లుతో పాటు బ్యాంక్‌లో రూ.1.15 లక్షలున్నట్టు సమాచారం. ఆమె ఆస్తులకు సంబంధించి సమీప బంధువు నామినీగా ఉన్నారు. అయితే ఆ డబ్బులను తమకు ఇవ్వాలని కొన్ని రోజులుగా ఇద్దరు కూతుళ్లు వచ్చి అడిగారు. ఈ విషయంలో కొన్ని రోజులుగా గొడవలు చోటుచేసుకోవడంతో కిష్టవ్వ అనారోగ్యానికి గురైంది. గత నెల 21 నుంచి కామారెడ్డి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. ఈ విషయాన్ని వైద్య సిబ్బంది వారి కూతుళ్లకు సమాచారం ఇచ్చారు. ఆమె బతికి ఉన్నప్పుడు బ్యాంక్ డబ్బులు అడిగితే ఇవ్వలేదని, తాము ఆమె మృతదేహాన్ని తీసుకెళ్లబోమని వైద్యులతో చెప్పారు. దాంతో వైద్య సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కూతుర్లు ఉండీ అనాథ శవంగా ఆస్పత్రిలో కిష్టవ్వ మృతదేహం ఉండటం స్థానికులను చలించింది. కాగా ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపడుతున్నారు.



కిరణ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టిఎస్‌యుఇఇయు నేతలు

కిరణ్ సేవలు ఎనలేనివి..

- కార్మికుల కోసం చేసిన త్యాగాలు వెలకట్టలేనివి
- వర్ధంతి సభలో టిఎస్‌యుఇఇయు నేతలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టిఎస్‌యుఇఇయు-సిఐటియు) మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ చేసిన సేవలు ఎనలేనివని పలువురు నేతలు కొనియాడారు. మింట్ కాంపౌండ్‌లోని యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో కిరణ్ నాలుగో వర్ధంతి సభ ఆదివారం జరిగింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె ఈశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి గోవర్ధన్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ జె ప్రసాదరాజు, కోశాధికారి జె బస్వరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిరణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కిరణ్ అమర్‌రహే, కిరణ్ ఆశాలు సాధిస్తాం అంటూ నినాదాలు చేశారు. రాష్ట్రంలోని 23 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను ఆర్టిజన్స్‌గా గుర్తించడంలో కిరణ్ చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ఇటీవల జరిగిన వేతన ఒప్పంద సమయంలో, ఏప్రిల్ 25 నుంచి జరిగిన ఆర్టిజన్ కార్మికుల సమ్మెలో 200 మందిని సర్వీస్ నుంచి తొలగించిన ఘటనల్లో కిరణ్ లేని లోటు స్పష్టంగా కన్పించిందని భావోద్వేగానికి లోనయ్యారు. విద్యుత్ కార్మికుల భవిష్యత్ కోసం నిరంతరం తపనపడుతూ కిరణ్ అనేక త్యాగాలు చేశారనీ, ఆ స్ఫూర్తితోనే రాబోయే రోజుల్లో ఆర్టిజన్స్ కన్వర్షన్, పీస్ రేట్ కార్మికులకు కనీస వేతనాలు, అన్మెండ్ కార్మికుల్ని ఆర్టిజెన్స్‌గా గుర్తించడం కోసం పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కిరణ్ వర్ధంతి సభలు రాష్ట్ర వ్యాప్తంగా 45 కేంద్రాల్లో జరిగాయి. ఆయా సభల్లో విద్యుత్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కిరణ్‌కు నివాళులు అర్పించారు.

మోడీకి జై కొడితే ఇంటికి.. లేకుంటే జైలుకే..

- కార్పొరేట్లకు రూ.16 లక్షల కోట్ల రాయితీ
- మోడీని వ్యతిరేకిస్తున్న 18 పార్టీలతో కెసిఆర్ కలవాలి
- సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- ఇబ్రహీంపట్నంలో 'ఇంటింటికీ సిపిఐ' ముగింపు సభ



సభలో మాట్లాడుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో మోడీకి జై కొడితే ఇంటికి.. వ్యతిరేకిస్తే జైలుకు అన్న రీతిలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పాలన సాగిస్తుందని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. అవినీతి సామ్రాజ్యానికి మోడీ నాయకుడిగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. 'బిజెపి హటావో దేశ్ కి బచావో' పేరుతో 'ఇంటింటికీ సిపిఐ' కార్యక్రమం ముగింపు సభ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఆదివారం నిర్వహించారు. ఈ సభకు నారాయణ హాజరై మాట్లాడారు. బిజెపి నాయకత్వంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై నిప్పులు చెరిగారు. అన్ని వస్తువులపై జిఎస్‌టి విధిస్తూ దండుకుంటున్న మోడీ ప్రభుత్వం పెట్రోలు, డీజిల్‌పై ఎందుకు జిఎస్‌టి విధించడం లేదని ప్రశ్నించారు. చివరికి శ్మశానాలపై సైతం జిఎస్‌టిలు విధిస్తున్నారన్నారు. చెప్పులపై సైతం 18 శాతం జిఎస్‌టి వసూలు చేస్తున్నారని చెబుతూ తన కాలు చెప్పును చూపుతూ మోడీ ప్రభుత్వంపై మండిపడ్డారు. బడా కార్పొరేట్లకు రూ.16 లక్షల కోట్ల రాయితీలు కల్పించిందన్నారు. ప్రముఖ ప్రొఫెసర్ సాయిబాబాతోపాటు మోడీ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్న వరవరరావు వంటి వాళ్లను సైతం అక్రమ కేసులు పెట్టి జైల్లో బంధిస్తున్నారని ఆరోపించారు. కోర్టులు బెయిల్ మంజూరు చేసినా ప్రభుత్వం అంగీకరించకపోవడం వల్లనే జైల్లోనే మగ్గుతున్నారని తెలిపారు. మోడీ మంత్రివర్గంలో 24 మంది మంత్రులపై కిడ్నాప్, మహిళలపై దాడులు, అక్రమ దందాలు చేసిన కేసులు కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సిఎం కెసిఆర్ ప్రభుత్వం మోడీకి వ్యతిరేకంగా నిలుస్తున్నారని అందుకు హర్షిస్తున్నామన్నారు. కానీ దేశవ్యాప్తంగా మోడీకి వ్యతిరేకంగా పనిచేస్తున్న 18 పార్టీలతో కెసిఆర్ ఎందుకు కలిసి రావడం లేదన్నారు. ఒకే వ్యక్తి మోడీని ఎదురుకోవడం సాధ్యం కాదని, దేశవ్యాప్తంగా మోడీని వ్యతిరేకించే పార్టీలతో కలిసి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రవీంద్ర చారి, మాజీ శాసనసభ్యులు కొండిగారి రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు కావలి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తూ

ఉద్యమాలను ఆపలేరు

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య
- పలు జిల్లాల్లో ముగిసిన మేడే వారోత్సవాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మిక హక్కులను కాలరాస్తూ ఉద్యమాలను ఆపలేరని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య ప్రభుత్వాలను హెచ్చరించారు. ఆదివారం 137వ మేడే వారోత్సవాల ముగింపు సందర్భంగా పలు జిల్లాల్లో సభలు నిర్వహించారు. యాద్రాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని ప్రిన్స్‌చౌరస్తా వద్ద సిఐటియు జిల్లా అధ్యక్షులు దాసరి పాండు అధ్యక్షతన జరిగిన సభలో వీరయ్య పాల్గొని మాట్లాడారు. 137 ఏళ్ల కిందటే కార్మికుల ఎనిమిదిగంటల పని దినాన్ని సాధించడం కోసం, కార్మికులు హక్కుల కోసం పోరాడి ప్రాణాలను సైతం అర్పించారే తప్ప వెనకడుగు వేయలేదన్నారు. ఆ అమరవీరుల స్ఫూర్తితో నేడు కార్మిక ఐక్యఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కులం, మతం పేరుతో కార్మికుల మధ్య భావోద్వేగాలను రెచ్చగొడుతూ కార్మికవర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తూ ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలను ప్రభుత్వాలు పొందుతున్నారని తెలిపారు. కార్మిక వర్గం ఇది గ్రహించిన రోజు ప్రభుత్వాలు కుప్పకూలుతాయని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెట్టడంతో పాటు నిత్యం పెంచుతున్న నిత్యావసర ధరలు పెంచుతూ ప్రజలపై భారాలు మోపుతున్నారన్నారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్‌కోడ్‌లను కేంద్రం తీసుకువచ్చిందని, ఎనిమిది గంటల పని దినాన్ని 12 గంటలుగా చేసిందని విమర్శించారు. దేశం మొత్తం కరోనాతో అతలాకుతలమైతే మోడీ ప్రభుత్వం మాత్రం పారిశ్రామిక వేత్తలకు ఊడిగం చేస్తూ రూ.70 వేలకోట్లు పారిశ్రామికవేత్తలకు రద్దు చేసిందన్నారు. మేడే వారోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన వివిధ క్రీడల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. బహిరంగ సభలో సిఐటియు జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ పాషా, గొరిగే సోములు, తదితరులు పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం అమరవరంలో జరిగిన మేడే కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి హాజరయ్యారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి పలు చోట్ల జెండాను ఎగురవేశారు.

సిఐటియు మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా సంఘం కార్యాలయం నుంచి ఇసిఐఎల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం చౌరస్తాలో సభ నిర్వహించారు. ఈ సభకు సిఐటియు మేడ్చల్ జిల్లా కార్యదర్శి జె చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా సీనియర్ నాయకులు కోమటి రవి, పిఎస్ఎన్ మూర్తి, జిల్లా సహాయ కార్యదర్శి జి శ్రీనివాసులు ప్రసంగించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని అన్నానగర్ అమరవీరుల స్తూపం వద్ద అంబేద్కర్ సంఘం సెంట్రింగ్ యూనియన్ జెండా ఏర్పాటు చేశారు. అనంతరం మేడే వారోత్సవాల కార్యక్రమాలు నిర్వహించారు. కార్మికులకు. పిల్లలకు, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లాల్లో మేడే వారోత్సవాల్లో భాగంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిభ చాటినవారికి బహుమతులను అందజేశారు.

డార్విన్ జీవ పరిమాణ సిద్ధాంతంపై వెయ్యి సదస్సులు

- జెవివి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు, శ్రీనాథ్
- ముగిసిన జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాలుగో మహాసభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా డార్విన్ జీవపరిణామ సిద్ధాంత ప్రచారంలో భాగంగా 1000 సదస్సులను నిర్వహించనున్నట్టు జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు, శ్రీనాథ్ తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని మనోరమ హోటల్‌లో రెండు రోజుల పాటు జరిగిన జెవివి రాష్ట్ర నాలుగో మహాసభ ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవ శాస్త్రానికి వెన్నెముకైన పరిణామ సిద్ధాంతాన్ని పదవ తరగతి పాఠ్యాంశం నుంచి తొలగించినందుకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా అనేక పాఠశాలలు, కళాశాలల్లో రానున్న రెండు, మూడు నెలల్లో వెయ్యి పైగా సదస్సులు నిర్వహించనున్నట్టు తెలిపారు. సమకాలీన శాస్త్ర అంశాలను విద్యార్థులకు నిరంతరం తెలియజేయడం కోసం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1500 పైగా పాఠశాలల్లో సైన్స్‌క్లబ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. తామ చేపట్టిన శాస్త్ర ప్రచార కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాల్సిందిగా శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు, మేధావులను కోరారు. విద్యార్థులతో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. నేడు పాలకులు అభివృద్ధి పేరుతో శాస్త్ర పరిశోధనల ఆవిష్కరణలను దుర్వినియోగం చేస్తున్నారని, దాని ఫలితమే మనం ఎదుర్కొంటున్న అనేక పర్యావరణ సమస్యలని తెలిపారు. రాష్ట్రంలోని నల్లమలలో యురేనియం తవ్వకాలు చేపట్టడం వల్ల జీవరాశులు, జలవనరులు ధ్వంసమవడంతో పాటు ప్రజల ప్రాణాలకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని, వాటిని నిలిపివేయాలని తీర్మానించామన్నారు. మహారాష్ట్ర, బీహార్‌లాగా మన రాష్ట్రంలోనూ మూఢనమ్మకాల నిరోధక చట్టం తీసుకురావాలని కోరారు. భవిష్యత్‌లో తాము చేపట్టబోయే అనేక కార్యక్రమాలకు ప్రజలు పూర్తి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణారెడ్డి, రాష్ట్ర నాయకులు వరప్రసాద్, జిల్లా జిల్లా అధ్యక్షులు వద్దిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ప్రధాన కార్యదర్శి అమరయ్య తదితరులు పాల్గొన్నారు.